క్లుప్తంగా

హరికథా విద్వాంసుడు శంభయాచారికి సత్కారం



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళా వేదికపై బుధవారం ప్రముఖ వయోలిన్ విద్వాంసుడు కాజన విశ్వరూపాచారి సంస్మరణ సభ నిర్వహించారు. కాజన రామకృష్ణ, తాళ్లూరి జయప్రద గాత్ర కచేరీతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. తాళ్లూరి ధరణి నృత్య ప్రదర్శన సభికుల్ని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రముఖ హరికథా విద్వాంసుడు తుర్లపాటి శంభయాచారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్ని నాట్యాచార్య డాక్టర్ కాజా వెంకట సుబ్రహ్మణ్యం, తిరువళ్లూరి శేషదుర్గ, తాళ్లూరి చక్రవర్తి పర్యవేక్షించారు.

అభివృద్ధి పనులపై కమిషనర్‌తో మేయర్ చర్చ



నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఏసీ) కోటేశ్వరరావును బుధవారం ఆయన చాంబర్‌లో నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. నగరంలో నిర్వహిస్తున్న, నిర్వహించాల్సిన వివిధ అభివృద్ధి పనులపై చర్చించారు. ముఖ్యంగా ఆర్‌యూబీ, ఆర్వోబీల నిర్మాణం, పీవీకే నాయుడు మార్కెట్ వంటి పెండింగ్ పనుల్ని కమిషనర్ దృష్టికి తెచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నగరపాలక సంస్థ అధికారులు సమన్వయంతో పనుల్ని వేగంగా చేపడుతున్నారని మేయర్ వివరించారు.

ఆర్‌వీఆర్‌జేసీలో గ్రాడ్యుయేషన్ డే

గుంటూరు రూరల్: చౌడవరంలోని ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 9న ఎనిమిదో గ్రాడ్యుయేషన్ డే వేడుకల్ని నిర్వహించనున్నట్లు ఆ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, విశిష్ట అతిథిగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ పి. రాజశేఖర్ పాల్గొంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో 2019–23 సంవత్సరం 35వ బ్యాచ్‌కు చెందిన 1177 మంది విద్యార్థుల్లో డిగ్రీ పూర్తి చేసుకున్న 991 మందికి డిగ్రీ పట్టాల్ని అందజేయనున్నట్లు తెలిపారు. ఆయా విభాగాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాల్ని అతిథుల చేతుల మీదుగా అందించనున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది ఇప్పటివరకు 1,146 మంది విద్యార్థులు ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ కంపెనీల్లో మంచి వేతనాలతో ఉద్యోగాలు సాధించారని తెలియజేశారు. వేడుకల్లో కళాశాల ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీ మోహన్, డాక్టర్ జగదీశ్‌కుమార్ మద్దినేని, కళాశాల సెక్రటరీ – కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్, కళాశాల పాలకమండలి సభ్యులు పాల్గొని విద్యార్థులకు డిగ్రీ పట్టాల్ని తల్లిదండ్రుల సమక్షంలో అందించనున్నారని వివరించారు.

టీడీపీ, జనసేన నేతల యాగీ



పట్నంబజారు: నగరంలో టీడీపీ, జనసేన నేతల ధోరణ పలు విమర్శలకు తావిస్తోంది. అభివృద్ధి పనులకు అడ్డుపడుతున్నారు. ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా బుధవారం నియోజకవర్గంలోని 9వ డివిజన్ బ్రహ్మంగారి గుడి వీధిలో రూ. 49లక్షలతో సైడు కాలువల్ని శంకుస్థాపన చేసేందుకు వెళ్లారు. స్థానిక టీడీపీ కార్పొరేటర్ అయిన యల్లావుల అశోక్, తన పార్టీ వారితో పాటు జనసేన నేతలతో కలసి ఉద్దేశపూర్వకంగా ఎమ్మెల్యే ముస్తఫాతో వాదులాటకు దిగారు. డివిజన్‌లో అభివృద్ధి పనులు చేయడం లేదంటూ ఏకపక్ష ధోరణితో గందరగోళ వాతావరణాన్ని సృష్టించారు. టీడీపీ నేతల తీరుపై ఎమ్మెల్యే ముస్తఫా అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందని టీడీపీ నేతలు అభివృద్ధి పనుల్ని అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు మేలు జరిగే పనులకు అడ్డు తగిలితే భగవంతుడు చూస్తూ ఊరుకోడని ఆయన వ్యాఖ్యానించారు. నియోజకవర్గంలో దశల వారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, త్వరలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడతామని తెలిపారు.

యువకునికి గాయాలు

పెదనందిపాడు: రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలయ్యాయి. కాకుమాను గ్రామానికి చెందిన సుభాని పెదనందిపాడు హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో రోడ్డు దాటుతుండగా, మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సుభాని కుడి కాలు విరిగి, తలకు గాయాలయ్యాయి.

ఓఆర్ఎస్‌తో 'డై'యేరియా కట్టడి

అతిసార (డయేరియా) వ్యాధి సోకినప్పుడు తల్లిదండ్రులు చేసే కొద్దిపాటి నిర్లక్ష్యంతో పిల్లల ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. సకాలంలో చికిత్స అందిస్తే ముప్పు తప్పుతుంది. ఏటా జిల్లాలో మూడు వేల మంది చిన్నారులు వ్యాధి బారిన పడుతున్నారు. సకాలంలో చికిత్స చేయించకపోవడం వల్ల 2019–20లో 15 మంది ఐదేళ్ల లోపు చిన్నారులు మరణించారు. 2020–21లో 13 మంది, 2021–22లో 12 మంది. 2022–23లో తొమ్మిది మంది చనిపోయారు. పిల్లల్లో డయేరియా మరణాల్ని నివారించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'అతిసార వ్యాధి నియంత్రణ' పక్షోత్సవాల్ని నిర్వహిస్తోంది. జిల్లావ్యాప్తంగా ఈనెల 5 నుంచి 17వ తేదీ వరకు వ్యాధి నియంత్రణ కార్యక్రమాలు, అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

- ముందస్తు జాగ్రత్తలతో పిల్లల్లో మరణాల నివారణ
- ఈనెల 17 వరకు అతిసార పక్షోత్సవాలు
- ఉచితంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వం



ప్రభుత్వం పంపిణీ చేస్తున్న జింక్ మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు



అతిసార అవగాహన పోస్టర్లు

గుంటూరు మెడికల్: ఐదేళ్లలోపు పిల్లలకు రోజులో మూడు సార్లుకంటే ఎక్కువ సార్లు విరేచనాలు (మోషన్స్) అవ్వడం, అందులో నీటి శాతం ఎక్కువగా ఉంటే దాన్ని అతిసారగా గుర్తించి తక్షణమే వైద్యుల్ని సంప్రదించాలి. వ్యాధి వైరస్ ద్వారా సోకుతోంది. వ్యాధి సోకిన చిన్నారుల్లో శరీరంలో నీటి శాతం బాగా తగ్గిపోతుంది. బిడ్డకు చంచలత్వం, చిరాకు, మైకం, అపస్మారకస్థితి, కళ్లు లోపలికి వెళ్లినట్లు ఉండటం, చర్మం స్థితిస్థాపకత లేకపోవడం, నొక్కినప్పుడు చాలా నెమ్మదిగా సాధారణ స్థితికి చేరుకుంటుంది. బిడ్డ చాలా దాహంతో ఉండటం, నీరు తాగులేకపోవడం లక్షణాలు కనిపిస్తే తక్షణమే డయేరియాగా నిర్ధారించుకుని వైద్యుల్ని సంప్రదించాలి.

ఓఆర్ఎస్‌తో విరేచనాలకు అడ్డుకట్ట

డయేరియాను ఓఆర్ఎస్ ప్యాకెట్‌తో పూర్తిగా కట్టడి చేయవచ్చు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వీటిని ఉచితంగా అందిస్తున్నారు. శుభ్రమైన పాత్రలో ఒక లీటరు తాగునీటిని పోసి నీటిని కాచి చల్లార్చి అందులో ఒక ఓఆర్ఎస్ ప్యాకెట్‌ను పోయాలి. పరిశుభ్రమైన స్పూన్‌తో కలిసిపోయేలా తిప్పాలి. పిల్లవాడి వయస్సు, శరీర బరువును బట్టి ద్రావణం తాగించాలి. రెండు నెలలకంటే తక్కువ వయస్సు ఉన్న శిశువుకు ప్రతి విరేచనం తరువాత ఐదు స్పూన్లు పట్టించాలి. రెండు నెలల నుంచి రెండు సంవత్సరాల పిల్లలకు ప్రతి విరేచనం తరువాత అరకప్పు, రెండు నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు ఒక కప్పు తాగించాలి. వ్యాధి మొదలైన నాటి నుంచి విరేచనాలు తగ్గే వరకు ఓఆర్ఎస్ ఇవ్వాలి. పిల్లలకు విరేచనాలు అవుతున్నా కూడా బ్రెస్ట్ మిల్క్ ఆపకూడదు. దాంతో పాటు గంజి, కొబ్బరి నీరు, పలుచని పప్పుచారు ఇవ్వడం మంచిది. ఓఆర్ఎస్‌తోపాటు జింక్ మాత్రను కూడా పిల్లలకు ఇవ్వాలి. ఇది వ్యాధి తీవ్రతను తగ్గిస్తోంది.

డయేరియా నియంత్రణే లక్ష్యం



జిల్లాలో డయేరియా వ్యాధి నియంత్రణ, మరణాల నివారణే లక్ష్యంగా 15 రోజులపాటు అవగాహన పక్షోత్సవాల్ని నిర్వహిస్తున్నాం. ఏఎన్‌ఎం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి ఐదేళ్లలోపు చిన్నారుల్ని గుర్తించి వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందిస్తున్నారు. హ్యాండ్ వాష్‌పై ఆసుపత్రుల్లో, ఇళ్ల వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా పిల్లలు వ్యాధి బారిన పడకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ కుర్రా వీరసుబ్బరాజు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి

ఉచితంగా వైద్యసేవలు



డయేరియా సోకిన చిన్నారులకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్య సేవలందిస్తున్నాం. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ – జింక్ కార్నర్లు ఏర్పాటు చేశాం. డయేరియా సోకిన చిన్నారులకు చికిత్స అందించే విధానంపై వైద్యులు, సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చాం.

– డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డీఎంహెచ్‌వో, గుంటూరు

శాస్త్రీయ సమాజ నిర్మాణమే జనవిజ్ఞాన వేదిక లక్ష్యం



సభ్యత్వ నమోదు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న లక్ష్మణరావు, జేవీవీ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: శాస్త్రీయ సమాజ నిర్మాణమే జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) లక్ష్యమని జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జేవీవీ జిల్లా కార్యవర్గ సమావేశంలో సభ్యత్వ నమోదు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ శాస్త్రీయ ప్రచార ఉద్యమంలో 35 ఏళ్ల ప్రస్థానం కలిగిన జేవీవీ ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్, స్వావలంబన కోసం సైన్స్ అనే నినాదంతో అనేక కార్యక్రమాల్ని నిర్వహిస్తోందని తెలిపారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఏ. సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో విద్యావంతులు సైతం మూఢ నమ్మకాల్ని నమ్ముతున్నారని, ప్రతి ఒక్కరు శాస్త్రీయంగా ఆలోచించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యుడు షేక్ అహ్మద్ హుస్సేన్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. ప్రసాద్, జి. వెంకటరావు, టి. జాన్‌బాబు, ఎం. ఉదయభాస్కర్, ఎండీ. అక్బర్, ఈ. అనిల్, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

వైభవంగా శత చండీయాగ మహోత్సవం



పాత గుంటూరు: ఏటీ అగ్రహారంలోని శ్రీ కంచి కామకోటిపీఠ శంకర గాయత్రీ దత్తసాయి సత్యదేవ మందిరంలో శత చండీ యాగ మహోత్సవం బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా గురు ప్రార్థన, గణపతి పూజ, పుణ్యాహవాచనం, మంటపారాధన, చండీ పారాయణ, సూర్య నమస్కారం, వేద పారాయణ, చండీ పారాయణ, గణపతి ప్రీతికి సహస్ర మోదక హోమం, ఈశ్వర ప్రీతికి మహాలింగార్చన, సాయంత్రం నీరాజన, మంత్ర పుష్పం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. గబ్బిట శివ రామకృష్ణ ప్రసాద్ దంపతులు లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. అలయ అధ్యక్షుడు రాళ్లబండి వెంకట సత్యరామాంజనేయశర్మ మాట్లాడుతూ ఈ నెల 11 వరకు మహోత్సవం కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి: డీఎంహెచ్‌వో

గుంటూరు మెడికల్: జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అట్టడుగు స్థాయి ప్రజలందరికీ చేరే విధంగా వైద్య సిబ్బంది అంకితభావంతో పని చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు చెప్పారు. గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో బుధవారం వైద్యులు, వైద్య సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. నిర్దేశించిన లక్ష్యాల్ని నిర్ణీత గడువులోగా చేరుకుని జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేలా కృషి చేయాలని ఆరోగ్య కేంద్రాల సిబ్బందికి చెప్పారు. ఆరోగ్య కార్యక్రమాల అమలులో దిగువ స్థానంలో ఉన్న ఉప కేంద్రాల వైద్యాధికారులతో సమీక్షలు జరిపి వారిలో నైపుణ్యాన్ని, పనితనాన్ని మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం డీపీఎంవో డాక్టర్ రత్న మన్మోహన్, డీఐవో డాక్టర్ కె.వి. సుబ్బరాజు, తెనాలి డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామికి అభిషేకార్చనలు



పాత గుంటూరు: మల్లారెడ్డి నగర్ శ్రీ విఘ్నేశ్వర, కుమారస్వామి సహిత శ్రీ ధర్మ శాస్త అయ్యప్ప స్వామి, శ్రీ విద్యా సరస్వతి, పర్వతవర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో అయ్యప్ప ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం రుత్వికులు శివకుమారశర్మ నిర్వహణలో అయ్యప్పస్వామికి పంచామృతాలు, విశేష సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగశాలలో రుత్వికులు అనీల్‌కుమార్ శర్మ బృందం చండీ హోమం నిర్వహించింది. విశేష హారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో మేళతాళాలతో అయ్యప్పస్వామి నగరోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో అన్నదాన కమిటీ చైర్మన్ గుంటూరు వేమారెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్చి యార్డు సమీపంలోని వై. జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న బుల్లెట్ వాహనాన్ని మరో ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మిర్చి యార్డులో పనిచేసే వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. మృతుడు ఏపీ 27 బీటీ 9717 వాహనంపై వెళుతుండగా ప్రమాదం జరిగింది. అతడి ఆచూకీ తెలిసిన వారు నేరుగా నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

డాబా పైనుంచి పడి వ్యక్తి మృతి

ఐదవ అంతస్తులో పని చేస్తూ ప్రమాదవశాత్తూ వ్యక్తి కిందపడి మృతి చెందిన సంఘటన బుధవారం అడవితక్కెళ్లపాడులో చోటు చేసుకుంది. మిషన్‌పారానికి చెందిన వినుకొండ కృష్ణబాబు పట్టాభిపురం పరిధిలో నిర్మిస్తున్న భవనంపై సెంట్రింగ్ పని చేస్తున్నాడు. ఈ క్రమంలో కాలుజారి కిందపడటంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు.

ఈదురు గాలులు, వర్షంతో నష్టం



శ్రీరంగపురంలో విరిగిన విద్యుత్ స్తంభాలు



ఉప్పరపాలెంలో ద్విచక్ర వాహనంపై విరిగిపడిన విద్యుత్ స్తంభం

చేబ్రోలు: మండలంలో మంగళవారం, బుధవారం వీసిన ఈదురు గాలులు, కురిసిన భారీ వర్షానికి పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి పోవడంతో పాటు ట్రాన్స్‌ఫార్మలు దెబ్బతిన్నాయి. మండల పరిధిలోని శ్రీరంగంపురం, ఉప్పరపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఉప్పరపాలెంలో ఓ ద్విచక్ర వాహనంపై స్తంభం విరిగిపడింది. విద్యుత్ శాఖాధికారులు అదనపు సిబ్బందిని వినియోగించి త్వరితగతిన సరఫరాను పునరుద్ధరించారు. సుమారు రూ.8లక్షల నష్టం సంభవించినట్లు ఏఈ పి. సుధీర్ తెలిపారు.

ఓవర్ లోడింగ్ వాహనాలపై స్పెషల్ డ్రైవ్

ప్రత్తిపాడు: ఓవర్ లోడ్‌తో వాహనాల్ని నడిపితే ఉపేక్షించేది లేదని ప్రత్తిపాడు సీఐ ఎం.వి.సుబ్బారావు హెచ్చరించారు. వట్టిచెరుకూరులో జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం చెందిన నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండు రోజులుగా ప్రత్తిపాడులో సీఐ ఆధ్వర్యంలో ఎస్ఐ డి. రవీంద్రబాబు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. పరిమితికి మించి, నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికుల్ని ఎక్కించుకున్న ట్రాక్టర్‌తో పాటు రెండు ఆటోల్ని సీజ్ చేశారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రత్తిపాడు: ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి అర్హులైన మహిళల నుంచి దరఖాస్తుల్ని ఆహ్వానిస్తున్నట్లు ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు శిశు అభివృద్ధి పథక అధికారి వి. సుజాతాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోస్టర్ ప్రకారం కాకుమాను మండలం చినలింగాయపాలెం సెంటరు ఆయా పోస్టు (ఎస్సీ), పెదనందిపాడు మండలం పమిడివారిపాలెం అంగన్‌వాడీ సెంటరు ఆయా పోస్టు (ఎస్సీ)కి రిజర్వు అయినట్లు పేర్కొన్నారు. అర్హులు ఈ నెల 12వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా ప్రత్తిపాడు ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని ఆమె సూచించారు. అభ్యర్థినులు 01-7-2022 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 ఏళ్లలోపు వయస్సుతో పాటు స్థానికంగా నివసిస్తూ, వివాహిత అయ్యి ఉండాలని తెలిపారు. ఏడో తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. వివరాలకు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని సీడీపీవో తెలిపారు.

వృద్ధురాలికి అరుదైన బ్రెయిన్ సర్జరీ



శస్త్రచికిత్స అనంతరం కోలుకున్న వృద్ధురాలితో డాక్టర్ లక్ష్మణరావు, డాక్టర్ విడదల కృష్ణకాంత్

గుంటూరు మెడికల్: ట్రైజెమైనల్ న్యూరాల్జియా అనే వ్యాధితో బాధపడుతున్న వృద్ధురాలికి అరుదైన శస్త్రచికిత్స చేసినట్లు సురక్ష హస్పిటల్స్ న్యూరో సర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణరావు చెప్పారు. స్థానిక కొత్తపేటలోని హస్పిటల్స్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జిల్లాలోని సంకురాత్రిపాడు గ్రామానికి చెందిన 85 ఏళ్ల మామిళ్లపల్లి సామ్రాజ్యానికి ట్రైజెమైనల్ న్యూరాల్జియా అనే వ్యాధి ఉన్నట్లు పరీక్షలు చేసి నిర్ధారించామన్నారు. దీనివల్ల విపరీతమైన దవడ నొప్పి వస్తున్నట్లు వెల్లడించారు. వ్యాధి నివారణకు ఆమె ఎన్నో హాస్పిటల్స్ తిరిగినా ప్రయోజనం లేకపోయిందని, నొప్పి భరించలేక ఆత్మహత్యకు కూడా సిద్ధపడినట్లు తెలిపారు. చివరగా తమ వద్దకు వారం రోజుల క్రితం రాగా వైద్య పరీక్షలు నిర్వహించి, మైక్రోస్కోప్‌తో మైక్రో వ్యాస్క్యులర్ డీ కంప్రెషన్ అనే సర్జరీని కేవలం చిన్న గాటుతో గంటలోపే ఆదివారం చేశామని చెప్పారు. మత్తు వైద్య నిపుణుడు డాక్టర్ విడదల కృష్ణకాంత్ ఆపరేషన్ ప్రక్రియలో పాల్గొన్నట్లు వెల్లడించారు. సుమారు రూ. 2 లక్షల ఖరీదు చేసే ఆపరేషన్‌ను ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేశామని చెప్పారు. ఆపరేషన్ పూర్తయిన వెంటనే నొప్పి పూర్తిగా తగ్గడంతో మంగళవారం సామ్రాజ్యాన్ని డిశ్చార్జి చేశామని వివరించారు.

బలహీనవర్గాలకు బీజేపీ పెద్దపీట

గుంటూరు మెడికల్: బలహీనవర్గాలకు బీజేపీ పెద్దపీట వేస్తోందని బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా నాయకుడు దారా అంబేడ్కర్ తెలిపారు. లాల్‌పురం రోడ్డులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం జిల్లా ఎస్సీ మోర్చా సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అంబేడ్కర్ ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి, ఎస్సీలకు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి వివరించారు. బీజేపీ తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ మాట్లాడుతూ ఎయిమ్స్ ద్వారా అత్యున్నతమైన వైద్య సదుపాయాల్ని ప్రధాని మోదీ రాష్ట్ర ప్రజలకు కల్పించారని తెలిపారు. అనంతరం 50 మంది ఎస్సీ యువకులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకుడు దారా సాంబయ్య, నేతలు పి.వి.రాఘవులు, ఇత్తడి కిరణ్, తాడిబోయిన రామకృష్ణ, రాయ నాగేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

వీవీఐటీలో ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్‌పై సాంకేతిక ప్రదర్శన



ప్రదర్శనలో విద్యార్థులు

పెదకాకాని: నేడు సౌకర్యవంతమైన జీవనం కోసం ప్రపంచం ఐఓటీ (ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్)పై ఆధారపడుతోందని మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీవీఐటీ) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జున రెడ్డి తెలిపారు. కళాశాలలో బుధవారం ఐఈఈఈ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ సాంకేతిక ప్రదర్శన(ప్రాజెక్ట్ ఎక్స్‌పో) నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పుల్లో ఐఓటీ ఒకటన్నారు. విద్యార్థులంతా ఈ నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని రూపొందించిన ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయని తెలిపారు. పలు కళాశాలల నుంచి 53 బృందాలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన ఐఓటీ సాంకేతికత ఆధారిత నమూనాలు స్మార్ట్ అగ్రికల్చర్, పొల్యూషన్, ట్రాఫిక్ నియంత్రణ, యాంటీ కోవిడ్ కిట్, అగ్రి బోట్‌లు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థుల్ని ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ అకడమిక్స్ డాక్టర్ కె. గిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ ఎస్. కుమారస్వామి, సీఐసీ విభాగాధిపతి డాక్టర్ ఎం.ఆర్.ఎస్. ఠాగూర్, సీఎస్ఓ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్. సురేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యతోనే జీవితాల్లో మార్పు



నాగులపాడు ఎస్టీ కాలనీలో అవగాహన ర్యాలీ

పెదనందిపాడు: విద్యతోనే జీవితాల్లో మార్పు సాధ్యమని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజినల్ కో‑ ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప తెలిపారు. స్థానిక నాగులపాడు ఎస్టీ కాలనీలో బుధవారం మధ్యాహ్నం డ్రాప్‌అవుట్ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నప్ప మాట్లాడుతూ ఈ కాలనీలో డ్రాప్‌అవుట్ విద్యార్థులు ఎక్కువగా ఉన్నారన్నారు. ప్రభుత్వం అమ్మఒడి ద్వారా తల్లుల ఖాతాల్లో రూ. 15వేలు జమ చేస్తున్న దృష్ట్యా పిల్లలందర్ని పాఠశాలలకు పంపి విద్యాబుద్ధులు నేర్పించాలని ఆయన చెప్పారు. పేద పిల్లల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని, వాటిని వినియోగించుకోవాలని ఆయన తల్లిదండ్రులకు తెలియజేశారు. కార్యక్రమంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఏరియా కో–ఆర్డినేటర్ వి. భగవాన్‌దాస్, వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం ఎం. సుబ్బారావు, వెల్ఫేర్ సెక్రటరి జగజ్జీవన్, గ్రామస్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

వెబ్ ఆప్షన్ నమోదుకు గడువు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న మోహనరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల వెబ్ ఆప్షన్ నమోదుకు గడువు పెంచాలని ఎస్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్షుడు గేరా మోహనరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో బుధవారం నిర్వహించిన సంఘ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్‌లో చేపట్టిన ఉపాధ్యాయ బదిలీల్లో అనేక లోపాలు, అసంబద్ధమైన విషయాలు, అశాస్త్రీయమైన నిబంధనలు, తప్పులతడకగా ఉన్న సాఫ్ట్‌వేర్‌తో ఉపాధ్యాయుల్లో గందరగోళానికి కారణమైందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీల్ని బ్లాక్ చేయడంతో ఉపాధ్యాయులందరూ తీవ్ర మానసిక ఆందోళనలో ఉన్నారన్నారు. తక్షణమే బదిలీల్ని మాన్యువల్ కౌన్సెలింగ్ విధానంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతి కౌన్సెలింగ్‌ను మాన్యువల్‌గా నిర్వహించేందుకు విద్యాశాఖ మంత్రి అంగీకరించినప్పటికీ, అధికారులు అమలు చేయకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. బదిలీ అవుతున్న ఉపాధ్యాయుల పోస్టుల కంటే 30 శాతం అదనంగా ఖాళీలు చూపించాలని విద్యాశాఖ మంత్రి చెప్పినప్పటికీ, అధికారులు అందుకు భిన్నంగా ఎక్కువ మొత్తంలో ఖాళీలు బ్లాక్ చేయడం అత్యంత బాధాకరమని తెలిపారు. సాఫ్ట్‌వేర్‌లో అనేక సర్వర్ సమస్యలు ఉండటంతో పాటు సీనియార్టీ, ఖాళీల జాబితాలు ఆలస్యంగా విడుదల చేసిన దృష్ట్యా వెబ్ ఆప్షన్ నమోదుకు గడువు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు, రాష్ట్ర మహిళా కన్వీనర్ సీహెచ్. ఉమ, ఉపాధ్యాయవాణి జిల్లా కన్వీనర్ షేక్ బాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు పేరేచర్ల శ్రీనివాసరావు, నాయకులు సీహెచ్. భానుమూర్తి, కె.వి.రమణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు సర్టిఫికెట్ల పంపిణీ

కాకుమాను: మండలంలోని వల్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఆరుగురు చిన్నారులకు బుధవారం సర్టిఫికెట్లు అందజేశారు.ఈ సందర్భంగా ఐసీడీఎస్ పొన్నపాడు సెక్టార్ సూపర్‌వైజర్ వెంకాయమ్మ మాట్లాడుతూ తల్లిదండ్రులంతా మూడు సంవత్సరాలు నిండిన తమ చిన్నారుల్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తప్పనిసరిగా చేర్పించాలని కోరారు. కేంద్రాల్లో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న చిన్నారుల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించనున్నట్లు ఆమె తెలిపారు.